# భూ బ్యాంక్ బండారం
# కార్పొరేట్లకు పందేరం



## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# ముందుమాట

2014 ఎన్నికల్లో జాతీయ భూవినియోగ విధానాన్ని చేపట్టి దాని ప్రకారం వ్యవసాయానికి పనికిరాని భూమిని మాత్రమే సేకరించి అభివృద్ధి చేస్తామని తద్వారా రైతుల ప్రయోజనాలు కాపాడతామని  బిజెపి అట్టహాసంగా ప్రకటించింది. 60సంవత్సరాలు దాటిన రైతులను, బీదబిక్కి రైతులను, వ్యవసాయ కార్మికులను సంక్షేమ పథకాలతో ఆదుకుంటామని వాగ్దానం చేశారు. కానీ మోడీ ప్రభుత్వం సంవత్సర పాలన వ్యవసాయ సంక్షోభాన్ని మరింత పెంచింది. గత సంవత్సరం 3.7% వున్న వ్యవసాయాభివృద్ధి రేటు ఈ సంవత్సరం 1.1% శాతానికి పడిపోయింది. 2014 డిసెంబర్‌లో వేసిన అంచనా ప్రకారం రైతుల ఆత్మహత్యలు 26%  పెరిగాయి. మోడీ ఎన్నికల ప్రసంగాలలో వ్యవసాయ ఖర్చులపై కనీసం 50% లాభం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చి 2015 ఫిబ్రవరి 15వ తేదీన దానికి విరుద్ధంగా ఇవ్వటం సాధ్యంగాదని సుప్రీం కోర్టుకు మొరపెట్టుకుంది.

బిజెపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్లమెంటులో భూ సేకరణ చట్టాన్ని బలపర్చింది. నేడు అధికారంలోకి వచ్చిన తరువాత దానికి వ్యతిరేకంగా డిసెంబర్ 14న ఒక ఆర్డినెన్సు జారీ చేసింది. ఈ విధంగా 3 సార్లు ఆర్డినెన్సు జారీ చేసి అబాసుపాలయ్యింది. దీని ఆధారంగానే మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం రాజధాని నిర్మాణానికై భూములను తీసుకోవడానికి పూనుకున్నాడు. ల్యాండ్‌పూలింగ్ పేరుతో రైతులను నట్టేట్ట ముంచుతున్నాడు. వ్యవసాయ భూములను కార్పొరేట్ కంపెనీలకు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అప్పగించడానికి పూనుకుంటున్నాడు.  రాజధాని ఏరియాలో 3 పంటలు పండే భూములను తీసుకోవడంద్వారా రైతులను భూములనుండి నెట్టివేయడమే కాకుండా ఆహారకొరత ఏర్పడడానికి కారణమౌతున్నాడు. చివరకు దళితుల చేతుల్లోవున్న అసైన్డ్ భూములు, సొసైటీ భూములను కూడా ఎటువంటి నష్ట పరిహారం ఇవ్వకుండా బలవంతంగా లాక్కోవడానికి పూనుకుంటున్నాడు.

ఇటువంటి రైతాంగ వ్యతిరేక, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, వృత్తిదారులు ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే వారిని అరెస్టు చేయడానికి కూడా వెనకాడడంలేదు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, మేధావులు పెద్దఎత్తున పోరాడాలని సిపియం పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

**అభివందనములతో...**

**– పెనుమల్లి మధు**

సిపిఐ(ఎం) ఎ.పి. రాష్ట్ర కార్యదర్శి

# భూ బకాసురుడి ప్రభుత్వం

ప్రభుత్వం సామాన్యులకు అండగా ఉంటుందని, ఆదుకుంటుందని జనం భావిస్తారు. కాని ఈనాటి ప్రభుత్వానికి ఆ ఆలోచనే ఉన్నట్టు కన్పించదు. గ్రామాలకు గ్రామాలను ఖాళీ చేయించి, వేలకు వేల ఎకరాలను బలవంతంగా లాక్కుంటూ లక్షలాది కుటుంబాలను నిరాశ్రయులను చేస్తోంది. అధికారంతో విర్రవీగుతోంది. గతంలో బకాసురుడికి ఆకలి తీర్చడానికి రోజుకొక గ్రామం ఆహారాన్ని సమకూర్చాల్సి వచ్చేది. నేడు ఈ ప్రభుత్వం బడా సంస్థల భూ దాహాన్ని తీర్చడానికి రోజుకొక ప్రాంతంలో భూ సేకరణను ప్రకటిస్తోంది. ప్రతి ప్రకటన కొన్ని వేల కుటుంబాలచే కన్నీరు పెట్టిస్తున్నది. గత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులపేర ధన యజ్ఞం నిర్వహించింది. నేడు తెలుగు దేశం ప్రభుత్వం అభివృద్ధిపేర భూయజ్ఞం తలపెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం, పాలనా యంత్రాంగం పారిశ్రామిక అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములను బడాసంస్థలకు ధారాదత్తం చేయడానికి పూనుకొంటోంది. అందుకోసం వివిధ రకాల భూములను గుర్తించి 15లక్షల ఎకరాలతో భూబ్యాంకు ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించింది. 13 జిల్లాల్లో అస్సైన్‌మెంట్ భూములు అనుభవిస్తున్న దళితులు, ఇతర పేదలు, తమ  భూములు లాగేసుకుంటారని తీవ్రమైన ఆందోళనకు గురి అవుతున్నారు.

వివిధ జిల్లాల్లో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, ఇండస్ట్రియల్ కారిడార్, పోర్టుల నిర్మాణం, ఎయిర్ పోర్టుల నిర్మాణం అని వేలాది ఎకరాలు బలవంతపు భూసేకరణ తలపెట్టింది. ఈ భూసేకరణ వలన అత్యధికంగా దళితులు, గిరిజనులు, వెనుక బడిన తరగతులు, పేద, మధ్యతరగతి రైతులే భూములు కోల్పోతున్నారు.

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు మంచి పరిపాలన అందిస్తాడనే భావంతోనూ, రుణమాఫీ లాంటి ఎన్నికల వాగ్దానాల పట్ల ఆకర్షణతో ప్రజలు చంద్రబాబుకు అధికారం కట్టబెట్టారు. గతంలో ప్రపంచబ్యాంకు సి.ఇ.ఓ.గా ముద్ర పడిన చంద్రబాబు మారానని చెబుతున్నా ఆచరణలో ఏ మాత్రం మారలేదు. నేడూ అదే బాటలో పయనిస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన మొదట్లోనే అస్సైన్‌మెంట్ లబ్ధిదారుల భూములకు పట్టా భూములతో సమాన హక్కులు కల్పిస్తామని,

అమ్మడానికి కూడా అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. కానీ 2015 మే 8న చిత్తూరు జిల్లా మదనపల్లిలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ భవిష్యత్‌లో దళిత, బలహీన వర్గాలకు భూపంపిణీ సాధ్యం కాదని తమ నిజ స్వరూపాన్ని బైట పెట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రభుత్వ భూములను, అన్యాక్రాంతమైన డి.కె.టి, అసైన్డ్ భూములను సమీకరిస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వం సేకరిస్తున్న అస్సైన్డ్ భూములపై 2004 మార్చి 9న రాష్ట్ర హైకోర్టు చారిత్రక తీర్పు ఇచ్చింది. అస్సైన్డ్ భూములను ప్రభుత్వం తేలికగా తీసుకోవడానికి వీలు లేదని, అవి పేదలకు రాజ్యాంగం ఇచ్చిన ఆస్తి అని, ప్రైవేటు భూములకు ఇచ్చిన నష్ట పరిహారం అస్సైన్డ్ దారులకు కూడా ఇవ్వాలని కోర్టు పేర్కొన్నది. దీనిపై కాంగ్రేస్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలు చేసి స్టే తెచ్చింది. ఆనాడు అసెంబ్లీలో సి.పి.ఎంతో బాటు ప్రతిపక్షంలో వున్న తెలుగుదేశం పార్టీ దీన్ని తీవ్రంగా విమర్శించాయి. కానీ నేడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం చట్టాలను అడ్డగోలుగా మార్చటమే కాకుండా, కోర్టు తీర్పులను సైతం ధిక్కరిస్తోంది.

జాతీయ ఉద్యమంలో దున్నే వాడికి భూమి అనేది స్వాతంత్ర పోరాట నినాదం. లక్షలాది మంది భూమిలేని పేదలు, కౌలుదారులు భూమికోసం, స్వాతంత్రం కోసం పోరాటాలలో పాల్గొన్నారు.స్వాతంత్ర్యానంతరం జమీందారీ విధానం రద్దు అయ్యింది. 1975లో భూ సంస్కరణల చట్టం చేసారు. ఆచట్టంలో అనేక లొసుగులు మూలంగా పేదలకు భూములు దక్కిందే తక్కువ. నేడు ఆ భూములన్నీ కంపెనీల పేరుతో కొల్లగొట్టడానికి ప్రభుత్వమే అవకాశం కల్గిస్తోంది.

1991 నుండి బహుళ జాతి సంస్థలు వర్ధమాన దేశాలలో వ్యవసాయ రంగంలో తమకు అనుకూలంగా మార్పులు తీసుకు రావాలని ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ప్రపంచబ్యాంకు, ఐఎమ్ఎఫ్, ప్రపంచ వాణిజ్య సంస్థలను సాధనాలుగా చేసుకున్నాయి. చిన్న కమతాలను దెబ్బ తీయాలనేది వారి కుట్ర. ఈ సంస్థలు వ్యవసాయారంగానికి ఇచ్చే సబ్సిడీలు రద్దు చేయాలన్న షరతులను పాలకవర్గాలతో అమలు జరిపించాయి. ఈ విధానాల్లో భాగంగా పంచిన సీలింగ్, అసైన్డ్ భూములను, సెజ్‌లు, పరిశ్రమలు, ప్రభుత్వ అవసరాల పేరిట వెనక్కి గుంజుకుంటున్నారు. నేడు చంద్రబాబు కార్పొరేట్ సంస్థల ప్రతినిధిగా మారి మొండిగా పేదల భూములను గుంజుకునే దుర్మార్గపు విధానానికి ఒడి గడుతున్నారు.

రాష్ట్రంలో 2004లో వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉండడంతో ప్రొఫెసర్ జయతీఘోష్ ఆధ్వర్యంలో "రైతు సంక్షేమ కమిషన్" వేశారు. "రాష్ట్రంలో లక్షలాది పడావు భూములు, సేద్యానికి పనికి వచ్చే ఇతర ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, సేద్యానికి

అవసరమైన పెట్టుబడులను లబ్ధిదారులకు అందించాలని" ముఖ్యమైన సిఫార్సులో కమిషన్ పేర్కొంది. తరువాత "కోనేరు రంగారావు భూకమిషన్ " రాష్ట్రంలో ప్రతి పేదవానికి కనీసం ఒక ఎకరా భూమిని ఇచ్చేందుకు అవకాశం ఉందని పేర్కొన్నది. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన వివరాలు తీసుకుని పలువురు ఐఏఎస్ అధికారులు రాష్ట్ర వ్యాపితంగా పర్యటించి నిగ్గు తేల్చిన సిఫార్సులు అవి. నేడు తెలుగుదేశం ప్రభుత్వం ఈ కమీషన్‌ల సిఫార్సులన్నింటినీ కాలరాస్తోంది.

అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు దశలు భూపంపిణీ అని నాటకం ఆడి మొక్కుబడి పంపిణీగా మార్చివేస్తే నేడు తెలుగుదేశం ప్రభుత్వం పేదలకిచ్చిన భూములు వెనక్కి లాక్కుని పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోంది.

2015 నుండి 2020 సం॥ వరకు రాష్ట్ర ప్రభుత్వ పారిశ్రామిక విధానం మార్గదర్శకాలను ముఖ్యమంత్రి విశాఖలో జూన్ 4 వతేదీన ప్రకటించారు. "పెద్ద పెద్ద కంపెనీలకు భూమిని 99 సంవత్సరాలకు లీజుకిచ్చే విధానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు". పారిశ్రామిక అభివృద్ధి జరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. నిజమైన పారిశ్రామికాభివృద్ధికి పారదర్శకత ఉండాలి. ఏ ప్రాంతంలోనైనా ఒక ప్రాజెక్టు లేదా ఒక పరిశ్రమ పెట్టాలనుకున్నప్పుడు ఎంత భూమి అవసరం అవుతుంది, వాటి ద్వారా ఏమి ఉత్పత్తి జరుగుతుంది ? ఎందరికి ఉపాధి కల్పన జరుగుతుందనేది అంచనా కట్టాలి. అలాగే ఎంత పెట్టుబడి వస్తుంది. ఎంతకాలంలో నిర్మాణం జరుగుతుంది. ఆ ప్రాంత అభివృద్ధికి ఆ పరిశ్రమ ఏ విధంగా తోడ్పడుతుంది. ఇటువంటి విషయాలన్నీ ప్రజలకు ప్రభుత్వం తెలియజేయడం మొదటి బాధ్యత.

ప్రభుత్వం లేదా ప్రైవేటు పరిశ్రమకు అవసరమైన భూమి అప్పగించాల్సినపుడు అక్కడి ప్రజలు అప్పటి వరకు పొందుతున్న ఉపాధి, జీవనం, ఇల్లు, విద్య , వైద్యం, రవాణా తదితర సదుపాయాలకు లోటు లేకుండా పునరావాసం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. ఇన్ని చేసినా రైతు కూలీల ఆమోదం పొందాలి. 2013లో పార్లమెంటు ఆమోదించిన భూసేకరణ చట్టంలో కొన్ని భద్రతలు కల్పించారు. ప్రభుత్వ ప్రాజెక్టుకు 70 శాతం, ప్రైవేటు పరిశ్రమలకు 80శాతం ప్రజలు ఆమోదం తెలపాలి. రెండు లేదా మూడు పంటలు పండే భూములు ఎట్టి పరిస్థితుల్లో తీసుకోరాదు. భూములు తీసుకున్నప్పుడు ఆభూములకు మార్కెట్ విలువకు నాలుగు రెట్లు పెంచి నష్టపరిహారం ఇవ్వాలి. వ్యవసాయ కార్మికులు, కౌలుదారులు, కల్లుగీత, గొర్రెల పెంపకం, రజక, క్షౌర, పశువుల కాపరులు లాంటి వృత్తిదారులు, చిన్న వ్యాపారులు వంటి వారికి జరిగే నష్టంపై, సామాజిక ప్రభావం అంచనా వేయాలి. వారికి నష్టపరిహారం సముచిత రీతిలో నిర్ణయించాలి. 2013 చట్టం 20 సంవత్సరాల పాటు పరిహారం అందించాలని పేర్కొన్నది.

అలాగే భవిష్యత్‌లో ఆ గ్రామాలకు ఇళ్ళస్థలాలు, విద్య, వైద్యం, సామాజిక అవసరాలకు సరిపడా భూమిని రిజర్వు చేయాలి.

2013 భూ సేకరణ చట్టం చేసినప్పుడు పార్లమెంట్‌లో ప్రతిపాదిత పరిశ్రమకు వచ్చే లాభాలు, ఉత్పత్తిలో కొంత భాగం నిర్వాసితులకు హక్కుగా కల్పించాలని సి.పి.యం, వామ పక్షాలు కోరాయి. ఈ సూచనను కాంగ్రెస్, బి.జె.పి.లు తిరస్కరించి చట్టానికి ఆమోదం తెలిపాయి. ఆనాడు తెలుగుదేశం పార్టీకూడా ఈ చట్టాన్ని బలపరచింది. నేడు చంద్రబాబు ఈ చట్టాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడంలేదు. చట్ట నిబంధనలు పాటించకుండా అవసరానికి మించి అనేక రెట్లు అడ్డగోలుగా భూసేకరణ చేయడంపైనే కేంద్రీకరిస్తున్నాడు. గతంలో మైలవరం, నూజివీడు ప్రాంతాల్లో అటవీభూముల్ని కాంగ్రెస్ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే – నాడు ప్రతిపక్షంలో ఎంఎల్‌ఏగా ఉన్న (నేడు మంత్రి) ఉమామహేశ్వరరావు దాన్ని ప్రతిఘటించాడు. నేడు దాన్నే స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రతిపక్షంలో ఉంటే ఒకమాట, అధికారంలో ఉంటే మరోమాటగా ఉంది అధికార పార్టీ వైఖరి. దారిద్ర్య నిర్మూలనకు, ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి కీలక అంశంగా ఉన్న భూములను దౌర్జన్యంగా గుంజుకోచూస్తున్నారు.

అవసరానికి మించి భూములు లాక్కొని "కాకులను కొట్టి గద్దలకు" వేసే పద్ధతికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదే నేటి ప్రభుత్వపు భూబ్యాంకు బండారం. కాంగ్రెస్ అధికారంలో ఉండగా ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం మచిలీపట్నంలో ప్రభుత్వ భూముల్లోనే పోర్టు నిర్మించాలన్నది.ఆందోళనలు చేపట్టింది. నేడు మాటమార్చి 31,000 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చింది.

## నిజాయితీ లేని రాజధాని నిర్మాణం

మంచి రాజధాని రావాలని అందరూ కోరుకుంటున్నారు. రాజధాని నిర్మాణంలో చంద్రబాబు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. నాలుగు వేల ఎకరాల విస్తీర్ణంలో సరిపోయే దానికి ప్రపంచ స్థాయి రాజధాని పేరుతో మొత్తం ఒక లక్ష 11 వేల ఎకరాలు సేకరించడానికి పూనుకుంటున్నారు. 2013 భూసేకరణ చట్టం ఉండగా రైతుల నుండి భూమి లాక్కోవడానికి పూలింగ్ అనే కొత్త ప్రక్రియ చేపట్టారు. నమ్మికొందరు, గత్యంతరం లేక మరి కొందరూ, భయపడి ఇంకొంతమంది, భ్రమతో మరికొందరు 33వేల ఎకరాల భూమిని పూలింగ్‌లో ప్రభుత్వానికి అప్పగించారు. భూసేకరణ చట్టం ద్వారా వచ్చే నాలుగు రెట్ల కంటే ఎక్కువ మొత్తం వస్తుందని రైతులను భ్రమింపజేశారు. భూ సేకరణ చట్టంలో మూడు పంటలు పండే భూమి తీసుకోరాదని, 70 శాతం రైతులు ఆమోదం లేకుండా భూసేకరణ చేయరాదనే 2013 భూసేకరణ చట్టం నిబంధనలు

తమకు రక్షణ కలిగిస్తాయనే ఆశతో చివరి వరకు పూలింగ్‌కు కొందరు రైతులు సిద్ధపడలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని, నరేంద్రమోడీని ఉపయోగించి 2014 డిసెంబరులో ఈ చట్టం స్థానే ఆర్డినెన్స్ తెచ్చి రైతులను గత్యంతరం లేని స్థితిలోకి నెట్టి పూలింగ్ పత్రాలపై సంతకాలు చేయించారు.

ఈ భూమి చాలదన్నట్లు 2015 ఆగస్టులో ఉండవల్లి, పెనుమాక, నిడమర్రు బేతపూడి, గ్రామాల్లో 3,800 ఎకరాల భూమిని భూసేకరణ చట్టం పేరుతో బలవంతంగా గుంజుకోవడానికి నోటీసులు ఇచ్చారు. పొలాలిచ్చిన రైతుల ఇళ్ళ స్థలాలను, చావిళ్ళను గ్రామ కంఠంలో లేవని చెప్పి వాటిని సేకరణలో కలిపి వేశారు. అన్ని గ్రామాల్లోనూ రైతులు గగ్గోలు పెట్టారు. రాజకీయ హద్దులతో నిమిత్తం లేకుండా గ్రామాల ప్రజలు సిఆర్‌డిఎ కార్యాలయానికి తాళాలు వేశారు. మంత్రులను నిలదీశారు.ప్రతి పక్ష పార్టీలు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాయి. దీనితో ఈ నాలుగు గ్రామాల నోటిఫికేషన్‌ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ప్రభుత్వం రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్నది రైతుల విమర్శ.

సింగపూర్, జపాన్ తదితర కంపెనీలకు రాజధాని భూములను 99 సంవత్సరాలు లీజుకు ఇవ్వడానికి జీ.వో. 110 విడుదల చేశారు. పూలింగ్ చేసిన భూమికి ఒక ఎకరానికి 4,800 చదరపు గజాలకు గానూ రైతులకు 1,000నుండి 1,450 చదరపు గజాలు (20% నుండి 30%) వరకే భూమిని ప్లాట్లుగా ఇస్తారు. "అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లుగా" ఈ ప్రక్రియ ద్వారా ఒక్క పైసా ఖర్చు చేయకుండా 70,80 శాతం భూమి ప్రభుత్వానికి దక్కుతుంది. రాజధాని నిర్మాణానికి వచ్చే సింగపూర్, జపాన్ కార్పొరేట్ దిగ్గజాలు, రాష్ట్ర ప్రభుత్వం ఈ భూమిని పంచుకుంటాయి. కొత్త రకమైన దోపిడీ విధానానికి ఇదొక మచ్చుతునక.

సీడ్ క్యాపిటల్ మూడు గ్రామాల్లో 4 వేల ఎకరాల్లో 5 సంవత్సరాల్లో 5 దశల్లో నిర్మిస్తామని సింగపూర్ మాస్టర్ ప్లాన్‌లో ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అసెంబ్లీ, సచివాలయం, మంత్రుల క్వార్టర్లు 140 ఎకరాల్లో నిర్మించడానికి ప్లాను తయారు చేసారు. 2020, 2030, 2050 నాటికి దశల వారీగా రాజధాని నిర్మాణం చేస్తామని ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌లో తెలిపింది.

అమరావతి పేరుతో నిర్మితమయ్యే రాజధాని ఫలానా విధంగా ఉంటుందని గ్రాఫిక్స్‌తో (బాహుబలి సినిమావలే) సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన బొమ్మలను రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించింది. అది చూసి కొందరు ఇంకేముంది సింగపూర్ ప్రభుత్వం, అధ్భుత రాజధాని నిర్మించబోతోందంటూ ఊహల్లో తేలుతున్నారు.సీడ్ క్యాపిటల్ పేరుతో ప్లాను ప్రకటించడంతో తాళ్ళాయపాలెం, ఉద్దండ రాయని పాలెం, లింగాయపాలెం నివాస గ్రామాలనే తరలిస్తారనే ఆందోళన నెలకొంది. సింగపూర్ ప్రభుత్వం విధించిన ఆంక్షలకు చంద్రబాబు ఆమోదం తెలిపితే

అది ఆత్మహత్యా సదృశ్యం అవుతుంది. కోటీశ్వరులు ఆడుకునే గోల్ఫ్‌కోర్టు, విలాసవంతమైన విల్లాలు, బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్‌లు కట్టి అమ్ముకోవడానికేనని విమర్శ చేస్తే అభివృద్ధికి అడ్డం పడుతున్నారని అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారు. వ్యతిరేకిస్తున్నది రాజధానిని కాదు . కార్పోరేట్ రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని . ప్రజలు, పలుపార్టీలు, ప్రజా సంఘాలు భూదందా ఆపాలని కోరుతున్నాయి. 1,000కోట్లతో నిర్మించేదాన్ని 10,000కోట్లతో నిర్మించవద్దన్నదే ప్రజల కోరిక. అసలు విమర్శ ఇది. చంద్రబాబు ప్రభుత్వం తన తప్పిదాలను కప్పి పుచ్చుకోవడానికి చెట్ల క్రింద కూర్చుని పాలన సాగిస్తామని సెంటుమెంటును అస్త్రంగా ఉపయోగిస్తున్నది.

ఏ దేశం అయినా మరో దేశంలోని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి ఉత్తినే ఎందుకు ముందుకు వస్తుంది. అనేక రెట్లు లాభాలకోసమే వస్తుంది. మన దేశంలోనే రాజధాని నిర్మాణం చేయగల అనేక సంస్థలు ఉన్నాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వం విదేశాల చుట్టూ తిరుగుతోంది. రాజధాని నిర్మాణానికి 2 లక్షలకోట్లు, 1లక్ష కోట్లు కావాలని అడిగిన చంద్రబాబు కేంద్రంలోని బిజెపిని డిమాండ్ చేయకుండా సావధానంగా విజ్ఞప్తులు చేయడం దివాళాకోరు తనం. రాష్ట్రంలోని పార్టీలన్నింటినీ ఢిల్లీకి తీసుకెళ్ళి విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి నిధులివ్వాలని ఒత్తిడి చేయడానికి కూడా సిద్ధం కావడం లేదు.

మరోవైపు భూమిలేని వ్యవసాయ కార్మికులు, చేతివృత్తులు, కౌలురైతులకు చట్టంలో 20 సంవత్సరాల పాటు నష్ట పరిహారం ఇవ్వాలని ఉండగా కుటుంబానికి కేవలం నెలకు రూ. 2,500 లు 10 సంవత్సరాలు మాత్రమే పింఛను క్రింద ప్రకటించారు. మొదట 28వేల మంది జాబితా రాగా, వడపోసి 18వేలకు తగ్గించారు. పచ్చచొక్కాల వారితో వేసిన కమిటీలు వారిని 11వేలకు తగ్గించారు. వారిలోనూ ఐదు వేల మందికి మాత్రమే 6 నెలలకు గాను ఒక నెల ఇచ్చి సరిపెట్టారు. రాజధాని గ్రామాలలో 365 రోజులు ఉపాధి పనులు కల్పిస్తామని స్వయంగా చెప్పిన చంద్రబాబు మాట తప్పారు. ప్రభుత్వం పూలింగ్ పేరుతో సేకరించిన 33వేల ఎకరాల భూముల్లో ఆరు మాసాల నుండి వ్యవసాయం లేకుండా పోయింది. అప్పటినుండి వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, పనులు లేక అల్లాడి పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత కూలీలు వలసలు పోతున్నారు. చేతివృత్తిదారులు, చిరు వ్యాపారులు దిక్కులేని వారిగా తయారయ్యారు. అతి సుందరంగా నిర్మిస్తామన్న రాజధానిలో దళితులకు, బలహీన వర్గాలకు స్థానం లేకుండా పోయింది. "చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లుగా" రైతుల్ని, అట్టడుగు వర్గాల ప్రజలను బైటికి నెట్టి పారిశ్రామిక వేత్తలకు, కార్పొరేట్ సంస్థలకే భూమిని ధారాదత్తం చేస్తున్నారు. ఇదీ చంద్రబాబు తీరు.

నూతన రాజధాని తుళ్ళూరు ప్రాంతాన్ని హైదరాబాద్‌ను తలదన్నే విధంగా నిర్మిస్తానని తరచూ చంద్రబాబు గొప్పలు  చెపుతుంటారు. 900కి.మీ.. సముద్రతీరం ఉన్న రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌లుగా తీర్చిదిద్దుతానని ప్రగల్భాలు పలుకుతున్నారు. రాష్ట్ర అభివృద్ధికి మౌలిక వసతులు కీలకం. రహదారులు, విద్యుత్, ఓడరేవులు, విద్య, వైద్యం, నీటి ప్రాజెక్టులు, విమాన యానం తదితర రంగాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన పెట్టుబడులు పెట్టాలి. ప్రభుత్వ రంగం అభివృద్ధి అయితేనే ప్రైవేటు పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్ అభివృద్ధి అయ్యిందంటే ప్రభుత్వ రంగంలో బి.హెచ్.ఇ.ఎల్, హెచ్.యం.టి, ఐడిపిఎల్, ఇ.సి.ఇ.ఎల్ లాంటి భారీ ప్రభుత్వ రంగ పరిశ్రమలు స్థాపించడమే ప్రధానకారణం. దానికి తోడు రక్షణ, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. తర్వాత కాలంలో సాఫ్ట్‌వేర్ రంగం వచ్చింది. ఇవన్నీ రాకుండా హైదరాబాద్‌ని తలదన్నే రాజధాని ఎలా వస్తుంది. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య  కేంద్ర ప్రభుత్వం రూ.1,500 కోట్లతో 500 బెడ్లతో  ఎయిమ్స్ (ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్) ఆసుపత్రిని కేటాయించినా ఈ 15 మాసాల కాలంలో  నిర్మాణం ప్రారంభించలేదు. 2015 మే 14న తలపెట్టిన శంఖుస్థాపన వాయిదా పడింది. 15 వేల కోట్లు లోటు బడ్జెట్‌ను పూడ్చడానికి యిస్తామన్న నిధులు రాబట్టలేదు. రైల్వే జోన్ రాలేదు. రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ, ఉత్తరాంధ్ర ప్యాకేజీ, రాష్ట్ర ప్రత్యేక హోదా ఏదీ రాలేదు. మరి ప్రపంచ స్థాయి రాజధాని ఎలా నిర్మితమవుతుందో!

## కృష్ణా నదిలో నిర్మించేది విహారకేంద్రాలు

ఏ రాష్ట్ర అభివృద్ధికైనా పునాది వ్యవసాయ,  పారిశ్రామిక రంగాలు.  వీటి అభివృద్ధికి చంద్రబాబు వద్ద వాస్తవ ప్రణాళిక లేదు. వ్యవసాయం పెట్టుబడుల లేమితో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. వ్యవసాయం రైతులకు గిట్టుబాటు కాక  ఆత్మహత్యలు పెరిగాయి. ప్రభుత్వ రంగ పరిశ్రమలు మూత బడుతున్నాయి. ప్రభుత్వం స్వయంగా లాభసాటిగా వున్నా విశాఖ స్టీల్ ప్లాంట్‌లాంటి పరిశ్రమల్లో పెట్టుబడులను ఉపసంహరిస్తుంది. ముఖ్యమంత్రి సింగపూర్, జపాన్, టర్కీలాంటి  దేశాలలో పర్యటిస్తున్నారు. ఈ దేశాల సంస్థలు లాభాలుంటేనే వస్తాయి. వచ్చినా ఇతర దేశాల్లో ఇంకా ఎక్కువ లాభాలు వస్తే అటు పరుగులు తీస్తాయి. లేదా పెట్టుబడులు తగ్గిస్తాయి.

రాజధాని శోభాయమానంగా ఉండేలా కృష్ణానదిని పూర్తి స్థాయిలో ఉపయోగిస్తారట. రాజధానికి అభిముఖంగా 16 కి.మీ. పొడవునా వినోద, విహార కేంద్రాలు, పార్కులు రానున్నాయని ప్రకటించారు . కృష్ణా నదిలో పర్యాటకుల కోసం విస్తృతంగా వాటర్ టాక్సీలు అందుబాటులోకి తేనున్నారు. ప్రకాశం బ్యారేజికి ఎగువన 23 కిలో మీటర్ల  దూరంలో

వైకుంఠపురం – గని ఆత్కూరు మధ్య మరొక బ్యారేజి కట్టి నీటిని నిల్వ చేస్తారని మరొక ప్రతిపాదన. గోదావరి నదిలో పాపికొండల వరకు విహార బోటు ప్రయాణించినట్లు కృష్ణానదిలో ఏర్పాట్లు చేస్తారట. రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బు లేదు. కేంద్ర ప్రభుత్వం తగినంత ఇవ్వదు. కానీ గాల్లో మేడలు కడుతున్నారు. "మింగ మెతుకు లేదు గాని మీసాలకు సంపంగి నూనె" అన్న చందంగా ఉంది. చివరకు కృష్ణా నది పర్యాటక కేంద్రంగా మారి విహార యాత్రల కు వచ్చే పర్యాటకులు వదిలే వ్యర్థాలతో కాలుష్యంగా మారేప్రమాదం పొంచి ఉంది.

## నిబంధనలు ఉల్లంఘించిన ప్రదేశంలో ముఖ్యమంత్రి నివాసం

కృష్ణానది దక్షిణం వైపు కరకట్ట, నది మధ్య 3.80లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అక్రమంగా నిర్మించిన అనేక భవనాలున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఏ.పి ప్రభుత్వ కార్యాలయాలకి కేటాయించిన స్థలం 2 లక్షల చదరపు అడుగులు మాత్రమే. నదికి ఆనుకుని 500నుండి 700 చదరపు అడుగుల మధ్య శాశ్వత భవనాలు నిర్మించరాదని చట్టం చెప్తుతోంది. సి.ఆర్.డి.ఎ. కమీషనర్ ఈ నిర్మాణాలకు అనుమతి లేదని ప్రకటన కూడా చేశారు. అటువంటి అక్రమ నిర్మాణమైన లింగమనేని ఎస్టేట్స్‌లో ముఖ్యమంత్రికి గృహం ఏర్పాటు చేశారు. ఆగస్టు 29న గృహ ప్రవేశం కూడా చేశారు. "కంచె చేను మేసినట్లు" నిబంధనలు ఉల్లంఘించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో చట్టాలను ఎలా సక్రమంగా అమలు జరుపుతారు?

## రాజధాని కోసం కృష్ణా, గుంటూరు జిల్లాల భూములకు ఎసరు

తుళ్ళూరు ప్రాంతంలో 29 గ్రామాల్లో మొత్తం రైతులు ఇచ్చిన భూమి 33వేల ఎకరాలతో పాటు ఇతర అన్ని రకాల ప్రభుత్వ భూములు కలిపి 54,000 ఎకరాలు ఉన్నాయి. ఇది చాలదట. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మరో 51,000 ఎకరాలు అటవీ భూములు డీ నోటిఫై చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. వాస్తవంగా ఏ చెట్లు లేని అటవీ భూములలో దీర్ఘకాలంగా దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారు, చిన్న రైతులు మామిడి తోటలు పెంచుకున్నారు. ఆరు ఫీల్డు లేబర్ కోపరేటివ్ సొసైటీలకు పట్టాలిచ్చారు. పంటలు సాగు చేస్తున్నారు.కృష్ణా జిల్లా మైలవరం, నూజివీడు, తిరువూరు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన 12 మండలాల్లో ఇటువంటి తోటలున్నాయి. సుమారు 60 వేల ఎకరాలకు పైగా రైతులు అనుభవిస్తున్నారు. 18కి పైగా వన సంరక్షణ సమితుల కింద (వి.ఎస్.ఎస్) సుబాబుల్, టేకు, చింత, వాసం చెట్లు వేసి పెంచుతున్నారు. ఈ భూములపై ఆధారపడిన వారంతా జీవనాధారం పోగొట్టు కుని నిరాశ్రయులవుతారు. ఇంతేకాక కృష్ణానది ఉత్తరం వైపు విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల మండలాల్లో నదిని ఆనుకుని మరొక 10వేల ఎకరాలు సేకరించడానికి పూనుకుంటున్నారు.

విజయవాడ పార్లమెంటరీ నియోజక వర్గంలో ప్రముఖ పారిశ్రామిక సంస్థ టాటా ట్రస్టు 264 గ్రామాలు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఆగస్టు మాసంలో రతన్ టాటా విజయవాడ వచ్చి ఒప్పందం చేసుకున్నారని ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు టాటా దత్తత తీసుకోవడం గర్వకారణమని, ఇటువంటి మహనీయులు అనేక మంది ముందుకు వచ్చి గ్రామాలను ఉద్ధరించాలని పొగిడారు. టాటా సంస్థ ఎన్ని నిధులు ఇచ్చేది ప్రకటించలేదు. ఏమి చేసేది ప్రకటించలేదు. అభివృద్ధి చేస్తామంటున్నది. టాటా సంస్థ ప్రభుత్వ రంగానికి చెందిన విదేశీ సంచార్ నిగంను స్వాహా చేసింది. 2జీ స్పెక్ట్రంలో అవినీతికి పాల్పడిందని ఆరోపణలున్నాయి. అంతేకాక రాజధాని భవన నిర్మాణంలో ఒక విభాగానికి చెందిన సర్వేను టాటా కన్సల్టెన్సీకి అప్పగించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, నిత్యం కరువుకు గురయ్యే రాయలసీమ జిల్లాల్లో గ్రామాలు గాక విజయవాడ పార్లమెంటు గ్రామాలను ఎంచుకోవడంలో ఉన్న ప్రయోజనాల ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## భోగాపురం విమానాశ్రయ భూమిలో ప్రభుత్వ కపట నీతి

విజయనగరం జిల్లా భోగాపురంలో ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడానికి విమానాశ్రయానికి అవసరానికి మించి 15 వేల ఎకరాలు సేకరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. విమానాశ్రయం రాకతో ఈ ప్రాంతమంతా అభివృద్ధి అవుతుందని ప్రచారం చేశారు. చుట్టూ ఉన్న భూములకు ధరలు భారీగా పెరుగుతాయని ఊదర గొట్టారు. ప్రతి పాదిత భూములలో స్వంతంగా కాయకష్టంచేసి పంటలు పండించే పేద, మధ్య తరగతి రైతులు ఎక్కువమంది ఉన్నారు. తమ జీవనాధారమే పోతుంటే, ప్రభుత్వం ఇచ్చే డబ్బు తమకు మిగలదని, గ్రామాలకు గ్రామాలే తరలించాల్సి వస్తుందని ఆందోళన చెందారు. పార్టీలతో నిమిత్తం లేకుండా ఎదురు తిరిగారు. మండల తహశీల్దారు ఆఫీసు నుండి జిల్లా కలెక్టరు కార్యాలయం వరకు వేలాది మంది ముక్తకంఠంతో కదం తొక్కారు. గ్రామాలకు సర్వే బృందాలను, రెవెన్యూ సిబ్బందిని అడుగు పెట్టకుండా అడ్డుకున్నారు. ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర మంత్రులను, ఎం.ఎల్.ఏలను పంపి ఎన్ని ప్రలోభాలు పెట్టినప్పటికీ రైతాంగం ఎదురు తిరిగింది. గ్రామగ్రామానికి ఉద్యమం విస్తరించింది.

చివరకు జూలై 7న విశాఖ పట్టణంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, శ్రీమతి మృణాళిని రెండుజిల్లాల కలెక్టర్లు అధికార యంత్రాంగం ప్లాన్ -1 క్రింద 5,500 ఎకరాల్లోనే విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. పెద్దనగరాలైన ముంబయిలో 1850 ఎకరాల్లో, చెన్నై లో 1283 ఎకరాల్లో విమానాశ్రయాలు ఉండగా వేల ఎకరాలు సేకరించడానికి ఎందుకు పూనుకున్నట్లు. ప్రజలు అమాయకత్వంతో ఉన్నా, భ్రమలతో ఉన్నా కుత్తుకలు

కత్తిరిస్తారు. ఎదురు తిరిగితే తగ్గుతారు. భోగాపురంలో ప్రభుత్వం 15000ఎకరాలనుండి 5300ఎకరాలకు తగ్గడంలో అందినకాడికి అందినంత భూమి గుంజుకోవాలనే కపట బుద్ధి బయట పడింది.

ఉద్యమం కొనసాగుతోంది. జూలై 27న కొంగువాని పాలెంకు సర్వే అధికారులు వచ్చారు. గ్రామస్తులు అడ్డుకున్నారు. 33 మందిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. సెప్టెంబరు 15న వామపక్షాల నాయకులు గూడెపు వలస గ్రామంలో సభ నిర్వహించగా వేలాది మంది పాల్గొన్నారు.

కాలం చెల్లిన ఆర్డినెన్స్‌కు గడువు ఆగస్టు31తో ముగిసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రెండు పంటలు పండే ఈ భూమిని సేకరించరాదు. 70 శాతం ప్రజల ఆమోదం తప్పనిసరి అవుతుంది. ఆగస్టు 31న సాయంత్రం 5.30 గంటలకు రెవెన్యూ శాఖ అధికారులు ఇంటికి వెళ్ళే సమయంలో అందరూ అక్కడే ఉండాలని హైదరాబాద్ నుండి ఆదేశాలు వచ్చాయి. హైదరాబాద్ నుండి విమానంలో కలెక్టరు గారు వచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్, ఆర్‌డిఓ, టూరిజం అధికారులు అంతాకలిసి అర్ధరాత్రి వరకు 5311 ఎకరాల భూమికి నోటిఫికేషన్ తయారు చేశారు. కలెక్టరు, జాయింటు కలెక్టర్లు కాలం చెల్లిన ఆర్డినెన్స్‌పై సంతకాల మీద సంతకాలు పెట్టి నోటిఫికేషన్ విడుదల చేశారు.

శత్రు దేశంపై సైన్యాన్ని పంపి యుద్ధం చేసినట్లు ప్రభుత్వం వ్యవహరించింది. పోలీసుల కవాతులతో ప్రజలను బెదిరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ దమన నీతికి, నిరంకుశత్వానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ.

## రైతుల నోట్లో మట్టి గొట్టి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం

ప్రతిపాదిత రాజధాని ప్రాంతానికి గన్నవరం విమానాశ్రయం 35 కిలో మీటర్లు. విజయవాడకు 20 కిలోమీటర్లు. ప్రస్తుతం 670 ఎకరాలలో ఉంది. మొదటి దశగా 480 ఎకరాలు సేకరించాలని నోటిఫికేషన్ విడుదల చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం చేయడానికి ఎవరికీ అభ్యంతరం లేదు. భూమి రిజిస్ట్రేషన్ విలువ అజ్జంపూడి గ్రామంలో ఎకరానికి రూ॥46.80 లక్షలు, బుద్ధవరంలో రూ.58.50 లక్షలు, కేసరపల్లిలో రూ.97.22లక్షలు ఉంది. బయట మార్కెట్ రేటు రూ.1కోటి 50లక్షలు ఉంది. రైతులు కేసరపల్లి గ్రామ రేటు రూ.97.22లక్షలు ఇస్తే స్వచ్ఛందంగా భూములు ఇస్తామని ముందుకొచ్చారు. రాజధాని విమానాశ్రయ భూమికి రూ.500కోట్లు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధ పడకుండా సంవత్సర కాలం వృధా చేసింది. బలవంతంగానైయినా లాగేస్తామని రైతులను బెదిరించడానికి పూనుకొన్నారు. తుళ్ళూరులోనే విమానాశ్రయం కడతామని ప్రచారం చేసారు.

అమ్మకాలు,కొనుగోళ్ళ పై నిషేధం విధించింది. చివరకు భూమి ఇచ్చిన వారికి తుళ్ళూరు పూలింగ్‌లో ప్లాట్లు ఇస్తామని ఆశ పెట్టింది. అయినప్పటికీ 300 ఎకరాలకు చెందిన రైతులు లొంగలేదు. చివరకు అమ్మకాలపై నిషేధం ఎత్తివేసి, తుళ్ళూరు పూలింగ్‌లో అందరినీ ముంచడానికి నిర్ణయం గైకొన్నది. ఇక్కడ కూడా కుటిలనీతి అమలు జరిపారే గాని రైతుల పట్ల ఔదార్యం చూపలేదు.

తిరునవంతపురంలో 628 ఎకరాలు, అహ్మదాబాద్‌లో 1124 ఎకరాలు, చెన్నైలో 1283 ఎకరాలలో, అలాగే సింగపూర్‌లో (అంతర్జాతీయ విమానాశ్రయం) 1200 ఎకరాలలో విమానాశ్రయాలున్నాయి. ఇప్పటికే గన్నవరం 1150 ఎకరాలకు పెరగగా, మరో 270 ఎకరాలకు ఫేజ్ -2 కింద నోటిఫికేషన్ ప్రకటించింది. 21 ఎకరాలలో ఉన్న వి.కె.ఆర్. డిగ్రీ కాలేజి భూములకు ప్రత్యామ్నాయం చూపలేదు. దావాజీ గూడెంలో దళితులకు చెందిన 100 ఇళ్ళున్న 10 ఎకరాలను విమానాశ్రయానికి ఆటంకం లేకుండా ప్రక్కకు జరపమన్నా అంగీకరించలేదు.

## బందరులో పారిశ్రామిక కారిడార్ పేరిట తీరప్రాంతమంతా ఆక్రమణ

బందరులో పోర్టునిర్మాణం ప్రజల చిరకాల వాంఛ. బ్రిటీషు వారి కాలంలో పేరుగాంచిన పోర్టుగా ఉండేది. విజయవాడ సమీపంలో రాజధాని ప్రకటించిన తరువాత మరింత ప్రాధాన్యత వచ్చింది. కాంగ్రెస్ పార్టీ హయాంలో పోర్టుకు శంఖుస్థాపన జరిగింది. అప్పుడు 5వేల ఎకరాలు తీసుకోవాలని ప్రతిపాదించగా ప్రతి పక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రభుత్వ భూములు 2500 ఎకరాలున్నాయని వాటిల్లోనే పోర్టు నిర్మించాలని ఆందోళనలు చేశారు.

తెలుగుదేశం అధికారం చేపట్టిన తరువాత 2015 ఏప్రిల్ మాసంలో ఏడు గ్రామాలకు చెందిన 5వేల ఎకరాల్లో పోర్టు నిర్మిస్తామని ప్రకటించారు. తెలుగుదేశం రెండునాలుకల ధోరణి దీని ద్వారా బయట పడింది. 2428 ఎకరాల ప్రభుత్వ భూముల్లోనే పోర్టు నిర్మాణం జరగాలని రైతులు కోరుతున్నారు.

కాలం చెల్లిన నరేంద్రమోడీ ఆర్డినెన్సును అడ్డు పెట్టి ఆగస్టు 31న 24 గ్రామాలకు చెందిన 31,000ఎకరాలకు హఠాత్తుగా నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తీరప్రాంత గ్రామాల ప్రజల్లో ఈ ప్రకటన సునామీ సృష్టించింది. తీరగ్రామాల్లో మత్స్యకారులు, దళితులు, పేద, మధ్యతరగతి రైతాంగం ఆగ్రహ జ్వాలతో రగిలిపోతున్నారు. తమ జీవనం ధ్వంసం కావడమే కాక గ్రామాలకు గ్రామాలనే ఖాళీ చేయాల్సి రావడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

దేశంలోనే మూడవ స్థానంలో ఉన్న చెన్నై పోర్టు 587 ఎకరాలలోనే ఉంది. ప్రఖ్యాతి గాంచిన కొచ్చిన్ ఓడరేవు 2000ఎకరాలు, మంగుళూరు 1908 ఎకరాలు, ఇటీవల విశాఖ పట్నం దగ్గర నిర్మించిన ప్రైవేటు ఓడరేవు 2000ఎకరాల్లోనే ఉన్నాయి.

పోర్టు వస్తే అనుబంధ పరిశ్రమలకు భూమి కావాలని అధికార పార్టీ వాదన. ఏ అనుబంధ పరిశ్రమలు వస్తాయి? వాటికి ఎంత భూమి కావాలి? ఎప్పుడు నిర్మిస్తారు? ఎంతమందికి ఉపాధి వస్తుందనే వివరాలు నిర్వాసిత ప్రజలకు చెప్పకుండా ఏకపక్షంగా నోటిఫికేషన్ ఇచ్చింది.

చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు రైతుల అభిప్రాయాలను బట్టి సమీకరణా (పూలింగ్), సేకరణా అనేది నిర్ణయిస్తామని మంత్రి రవీంద్ర, లోక్ సభ సభ్యుడు కొనకళ్ళ నారాయణ ఆత్మ రక్షణలో పడి పొంతనలేని ప్రకటనలిస్తున్నారు. భూములిచ్చిన రైతులకు ఊహించని విధంగా మేలు చేస్తామని, తుళ్ళూరు రైతులకిచ్చిన దాని కంటే ఎక్కువ ఇస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. రైతులు అంగీకరించకపోతే పోర్టు తరలి పోతుందని బెదిరింపులకు దిగారు.

గతంలో ఈస్టిండియా కంపెనీకి ప్రాంతాలను కట్టబెట్టినట్లు విదేశీ, స్వదేశీ గుత్త కంపెనీలకు తీర ప్రాంతాన్ని గుండుగుత్తగా అప్పగించే దుస్సాహసానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం తప్ప ఇది మరొకటి కాదు.

### శ్రీకాకుళం జిల్లా పోలాకి నెత్తిన మరో "థర్మల్ " కుంపటి

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలంలో 10 గ్రామాలకు చెందిన 2400 ఎకరాల్లో జపాన్ దేశానికి చెందిన సుమిటోమి కంపెనీ ద్వారా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో సన్యాసిరాజుపేట, కోరాడ లచ్చయ్య పేట, ఓదుపాడు, కొండలక్కి వలస గ్రామాలను పూర్తిగానూ, తోడాడ గ్రామాన్ని పాక్షికంగానూ ఖాళీ చేయాల్సి వస్తుంది. ఈ భూమిని సమీకరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. గొర్రెల మేకల పెంపకం దారులు, కల్లు గీత కార్మికులు, రాళ్ళుకొట్టే కుటుంబాలు, డిపట్టాలు పొందిన వారు, రైతులు అందరూ కలసి 1150 ఎకరాలలో పొందుతున్న ఉపాధి కోల్పోతారు. అలాగే 450 ఎకరాల కొండ పోరంబోకు సాగు చేస్తున్న రైతులు మొత్తం తమ జీవనాధారం కోల్పోతారు. ఇండియా కంపెనీలు గ్లోబల్ టెండర్లు ద్వారా ఇతర దేశాల్లో విద్యుత్ ప్లాంట్లు నిర్మిస్తుంటే ఎ.పి ప్రభుత్వం జపాన్ కంపెనీని రారమ్మని ఆహ్వానిస్తుంది. రాష్ట్రంలో 35 థర్మల్ ప్రాజెక్టులుండి, విద్యుత్ ఉత్పత్తిలో మిగులు ఉండగా జపాన్ కంపెనీని రమ్మనడంలో రహస్యం ఏమిటి? ఈ ప్రాజెక్టు మర్చంట్ థర్మల్ పవర్‌ప్లాంట్. ఈ కంపెనీ ఉత్పత్తి చేసే 4000 మెగావాట్లు పూర్తిగా అమ్ముకోవడానికేనన్నది స్పష్టం. అంటే ఈ లాభాల్లో రాజకీయ నాయకులకు, దీనికి తోడ్పడే కంపెనీలకు ఎన్ని లావాదేవీలున్నాయోమరి? అక్కడ పర్యటిస్తే ఈ రహస్యాలు బయట కొస్తాయనే కాబోలు సిపియం రాష్ట్రకార్యదర్శి పి.మధుని ఆముదాలవలసలో రైలు దిగుతుండగానే అరెస్టు చేశారు. మన జెన్‌కో పవర్ ప్లాంట్ నిర్మిస్తే మెగావాట్‌కు రూ.4,5 కోట్ల మధ్య ఖర్చు

అవుతుంటే, జపాన్ కంపెనీ సుమిటోమి రూ. 12 కోట్లు ఖర్చుతో నిర్మించటానికి ప్రతిపాదనలు చేసింది. విదేశీ కార్పోరేట్ కంపెనీలు ఈ రీతిగా మన ప్రజలను దోచుకోవడానికి అవకాశం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై విస్తుపోయింది.

## సోంపేట విజయాన్ని కాలరాస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సోంపేటలో నాగార్జున నిర్మాణ సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం 2009 సంవత్సరంలో 972 ఎకరాల భూమిని అతితక్కువ రేటుకు కేవలం ఎకరం 80,000రూపాయలకు అమ్మింది. బీల భూముల్లో (నిరంతరం నీరు నిల్వఉండే) థర్మల్ స్టేషన్ నిర్మించరాదని పెద్ద ఉద్యమం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కమిటి, మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యాన సుదీర్ఘకాలం ఉద్యమం సాగింది. 2094 రోజులు అంటే 5 సంవత్సరాల 73 రోజులు నిరాహార దీక్షలు చేశారు. రుషికుడ్డ, గొల్లగండి, బారువపేట, బెంకిలి గ్రామాలకు చెందిన ప్రజలు వీరోచిత పోరాటం చేశారు. 2010 జూన్ 14 న 13 గ్రామాల ప్రజలు శంకుస్థాపనకు నిరసనతెలిపితే ముగ్గురిని పోలీసులు కాల్చి చంపారు. వెయ్యి మందిపై కేసులు మోపారు. ప్రజల సుదీర్ఘ పోరాటం వలన థర్మల్ ప్లాంట్‌కు అనుమతి రద్దయ్యింది. ఈ భూముల్లో పరిశ్రమ పెట్టడం వలన నీరు కలుషిత మవ్వడమే కాక కొండల నుండి జాలువచ్చే నీరు మరో 30,000ఎకరాలకు ప్రవహించడానికి అవరోధమవుతుంది. ఈ భూముల్లో అనేక రకాల పంటలు పండుతున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వం జి.వోనెం. 329 ద్వారా థర్మల్ స్టేషన్ రద్దు చేసి మరల అదే నాగార్జున సంస్థకు వేరే పరిశ్రమలకోసం నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. ఒక తప్పును సరిదిద్ది మరో తప్పుకు అంకురం తొడిగింది. ఈ బీల భూముల్లో ఏ పరిశ్రమ నిర్మించినా మూడు మండలాలకు 26 గ్రామాలకు చెందిన వేలాది ఎకరాల పంటలకు ముప్పు వాటిల్లుతుంది. దీనిపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర మనోవ్యధకు గురవుతున్నారు. పారిశ్రామిక సంస్థల పట్ల గత కాంగ్రెస్‌కు , నేటి తెలుగు దేశానికి ఎంత మమకారం ఉంటుందో ఇదొక తార్కాణం.

## బావనపాడు పోర్టుకు 5500 ఎకరాలు

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం బావనపాడు పోర్టు కొరకు 15 గ్రామాలకు చెందిన 5500 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. ఇది తొలివిడత సేకరణ అని రెండవ విడత 19 వేల ఎకరాలు సేకరిస్తామని ప్రకటించింది. 1986లో ప్రారంభమైన చిన్న హార్బరు కార్యకలాపాలు లేక స్తంభించింది. మత్స్యకారులు ఎక్కువ ఉండే గ్రామాలు ఇవి. ఆ గ్రామాల ప్రజలు తమ జీవనం విచ్ఛిన్నమవుతుందని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఈ గ్రామాల ప్రజలకు శరాఘాతంగా తగిలింది.

ఈ నిర్ణయం వల్ల కోరుకున్నంత భూమి వస్తుందని ప్రైవేటు కంపెనీలు సంబరపడుతున్నాయి.

## గిరిజనుల జీవనోపాధిని దెబ్బతీయడంలో కాంగ్రెస్, తెలుగుదేశం రెండూ తోడుదొంగలే

విశాఖ ఏజెన్సీలో మళ్ళీ బాక్సైట్ సెగ రగులుకుంది. అన్‌రాక్ కంపెనీ పరిసర ప్రాంతాలలో, బాక్సైట్ ప్రభావిత ప్రాంతాలలో మావోయిస్టుల పేరుతో పోలీసు బలగాలను మోహరించారు. నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద సొంత అవసరాల కోసం జెట్టీ నిర్మాణానికి అన్‌రాక్ అల్యూమినియం కంపెనీకి అనుమతి ఇచ్చినట్లు చంద్రబాబు 2015 సెప్టెంబరు 7న అసెంబ్లీలో ప్రకటించారు.

2008 జూన్ 7న బాక్సైట్ తవ్వకాలపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గిరిజనులకు అండగా వామపక్షాలు, గిరిజన సంఘాలు నిలబడి తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రజాభిప్రాయ సేకరణలో గిరిజనులు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించినా, తొలి దశలో పర్యావరణ అనుమతులు వచ్చేలా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించింది. రెండోదశ అనుమతులు వచ్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం తన ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది.

ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు బాక్సైట్ ఒప్పందాలను రద్దు చేయాలంటూ తవ్వకాలను వ్యతిరేకించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాటమార్చారు. మాకవరపాలెంలో నిర్మించిన అన్‌రాక్ అల్యూమినియం కంపెనీకి చింతపల్లి బ్లాక్‌లోని జర్రెల ప్రాంతంలో 3400 ఎకరాలలో 24.80 లక్షల టన్నుల ముడి అల్యూమినియంను కట్ట బెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

లక్షలాది గిరిజనుల జీవనోపాధిని దెబ్బ తీసి వేలకోట్ల రూపాయల బాక్సైట్‌ను కంపెనీలకు ధారాదత్తం చేయడంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు రెండూ తోడుదొంగలుగా వ్యవహరిస్తున్నాయి.

## రాష్ట్రంలో ప్రతి జిల్లాలో భూముల స్వాహా

చంద్రబాబు నాయుడి 'భూ' ఆకలి పోలికేకలతో రాష్ట్రం ప్రతి ధ్వనిస్తోంది. చంద్రబాబు సొంత నియోజక వర్గం కుప్పం. బెంగుళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి 130 కిలోమీటర్లు. కుప్పం నియోజకవర్గంలో శాంతిపురం మండలం కడపల్లి గ్రామ పంచాయితీలో 1500 ఎకరాల భూములున్నట్లు అధికారుల కంటబడింది. 800 మంది రైతులు 75 , 80 సంవత్సరాల నుండి ఈ అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్నారు. విమానాశ్రయం నిర్మించాలనే ప్రతిపాదనతో ఈ భూములను ఖాళీ చేయమని నోటీసులు ఇచ్చారు. జిల్లాలో 2 విమానాశ్రయాలు అవసరమా? అన్నది ప్రజల ప్రశ్న . అభివృద్ధి పేర భూములు గుంజుకోవడానికి తప్ప సహేతుక కారణం కనిపించటంలేదు. రెండోది ఈ భూములు గుట్టలు మిట్టలుగా ఉన్నాయి. చదును చేసే సొమ్ముతో ఇంతకు రెట్టింపు భూములు కొనుక్కోవచ్చు. అయినా భూముల సేకరణకు

ఉపక్రమించడం నిజంగా విమానాశ్రయాన్ని నిర్మించడం కోసం కాదని స్థానికులు భావిస్తున్నారు.

కర్నూలు జిల్లా జూపాడు బంగ్లా మండలం తంగడంచెలో ఫుడ్ పార్కు ఏర్పాటుకు గుజరాత్‌కు చెందిన అంబూజా కంపెనీకి 350 ఎకరాలకు రాష్ట్రప్రభుత్వం అన్ని అనుమతులూ ఇచ్చింది. ఉద్యానవన పార్కుకు జైన్ కంపెనీకి 758 ఎకరాలు ఇచ్చారు. ఈ భూమిని పేదలకు పంచాలని 1999 – 2006 మధ్య వ్యవసాయ కార్మికులు పోరాటాలు చేశారు. 7 సంవత్సరాల పోరాటాన్ని పెడచెవిని పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం బడా పెట్టుబడిదారులకు అడిగిందే తడవుగా ఆఘమేఘాల మీద జి.వోలు ఇచ్చింది. చివరకు స్థానిక చిన్న పారిశ్రామిక వర్గాలు కర్నూలు నగరంలో ట్రాన్స్ పోర్టు రంగానికి ఆటోనగర్‌కు స్థలం చూపాలన్న కోర్కెను కూడా ప్రభుత్వం తిరస్కరించిందని వాపోయారు.

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం చెకునాల గ్రామంలో ప్రైవేటు సోలార్ విద్యుత్ సంస్థకు 3143 ఎకరాలు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ప్రభుత్వ బంజరు 2422 ఎకరాలు. డి.కె.టి. 614 ఎకరాలు ఉన్నాయి. ఈ భూముల్లో గత 15, 20 సంవత్సరాల నుండి కందులు, పత్తి, జొన్న లాంటి పంటలు పండిస్తున్నారు. డిగ్రీ దాకా చదివి ఉద్యోగం రాక మద్దిరెడ్డి అనే యువకుడు ఈ భూమిలో 5 ఎకరాలు సాగుచేసి అప్పుల పాలయ్యి ఆత్మహత్య చేసుకున్నాడు. గడివేముల మండలానికి చెందిన గని అనే గ్రామంలో కూడా 2500 ఎకరాలు ఇదే సంస్థ చేతుల్లో పెట్టారు. ఈ రెండు గ్రామాల్లో మొత్తం 5643 ఎకరాల్లో సాగులో ఉన్న దళితులు, పేదరైతులు పట్టాలివ్వాలని అనేకసార్లు ధర్నాలు చేశారు. నేడు వీరికి ఏ నష్టపరిహారం ఇవ్వకుండా ఒక కలం పోటుతో ఈ భూములన్నీ ప్రైవేటు విద్యుత్ సంస్థకు కట్టబెట్టారు. పెద్దకొడుకులా వ్యవసాయ రంగాన్ని ఆదుకుంటానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం పేదరైతుల పొట్టగొట్టింది.

పశ్చిమగోదావరి జిల్లా దూబచర్ల, పుల్లలపాడు, ముసుళ్ళకుంట గ్రామాల్లో 80 సంవత్సరాల నుండి పేదలు సాగుచేసుకుంటున్న 550 ఎకరాల భూములను ఆయుధాల విడిభాగాల తయారీ పరిశ్రమ కోసం ఎపిఐఐసి ద్వారా స్వాధీనం చేసుకోవడానికి నోటీసులు ఇచ్చారు. ఇందిరా జలప్రభ ద్వారా బోరులు మంజూరు చేసి నీటివసతి కల్పించారు. నిమ్మ ,కొబ్బరి, పామాయిల్ తోటలతో పచ్చగా కలకలలాడుతున్న ఈ భూములను ప్రభుత్వం లాక్కోవటంతో దళితులు, పేదలు గుండెకోతతో కుమిలిపోతున్నారు.

కృష్ణా జిల్లాలో నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన 18 తీర గ్రామాల్లో 22వేల ఎకరాలు అటవీ శాఖకు అప్పగించారు. ఇందులో అత్యధికం రెవెన్యూ భూములు. మత్స్యకారులు ఇతర పేదలు ఈ భూముల్లో చాపలు, రొయ్యల చెరువులు, కొంత భాగం పంటలు పండిస్తున్నారు. వీరికి ఎటువంటి నష్ట పరిహారం ఇవ్వకుండా తొలగింప చూస్తున్నారు.

నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సెజ్ కోసం ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రలోభపెట్టి భూములు సేకరించారు. కానీ వీరికి మొండిచేయి చూపారు. సాంకేతిక పరిజ్ఞానం భారీగా పెరిగిన నేపథ్యంలో కొద్ది సంఖ్యలోనే సాంకేతిక నైపుణ్యం కలిగిన ఇంజనీర్లు, ఆఫీసర్లు పోస్టులు లభ్యమవుతున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి పేరిట పెద్దఎత్తున ఉద్యోగాలు లభ్యమవుతున్నాయనేది వాస్తవం కాదు. రాష్ట్రంలో సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్‌లన్నింటిలో స్థూలంగా ఇదే అనుభవం.

## హిందూపూర్‌లో రైతులను మోసగించిన రసోయి

భూములిస్తే పరిశ్రమలు పెడతాం. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తాం. అంటూ రైతులనుండి భూములను లాక్కుని ఏళ్ళు గడుస్తున్నా ఒక్క పరిశ్రమ పెట్టని వైనం హిందూపూర్‌లోజరిగింది.

అనంతపురం జిల్లా హిందూపూర్ పట్టణానికి దగ్గర పరిగి మండలకేంద్రంలో 2774 ఎకరాలను తక్కువ రేటుతో పరిశ్రమలు స్థాపిస్తామని రైతుల నుండి రసోయి పారిశ్రామిక సంస్థ సేకరించింది. ఇందులో 244ఎకరాలు ప్రభుత్వ భూమి కూడా ఉంది. రైతులకు తమ పరిశ్రమలో ఉపాధి కల్పిస్తామని లిఖిత పూర్వక పత్రాలు కూడా అందజేసింది. ఒక్క భవనం కూడా నిర్మించలేదు. రైతుల నుండి ఎకరం 90వేల రూపాయలకు కొన్న ఆ సంస్థ నేడు రూ. 10 లక్షలకు అమ్మేందుకు బేరం పెట్టింది.

## రాష్ట్ర ప్రభుత్వ నిర్భంధ విధానం

శ్రీకాకుళం జిల్లా పోలాకిలో నిర్మించదలచిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్ర నిర్వాసితులతో మాట్లాడే ప్రయత్నం చేసిన సిపియం రాష్ట్రకార్యదర్శి పి. మధుని అక్రమంగా నిర్భందించింది. ప్రజా సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వ అసహనానికి ఇది పరాకాష్ట. ఈ విషయం బయట ప్రపంచానికి తెలియజేయనీయకుండా చేసేందుకు ఆయన సెల్ ఫోన్ గుంజుకున్నారు. మారుమూల ప్రాంత పోలీసుస్టేషన్‌కు తరలించి రాత్రి 8 గంటల వరకు ఉంచడం ఎమర్జెన్సీ పరిస్థితులను తలపిస్తున్నాయి. కామ్రేడ్ మధు ఉగ్రవాది, తీవ్రవాది కాదు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడానికి పోలాకి వెళ్ళడంలేదు. బలవంతంగా భూములు లాక్కుంటుంటే బాధితుల గోడు వినేందుకు వెళ్ళడం కూడానేరమా? అలాగే రాజధాని ప్రాంతంలో రైతుల గోడు బైటకు పొక్కకూడదని అక్కడ 144సెక్షన్ విధించారు. విశాఖలో ప్రత్యేక హోదా సదస్సుకు పర్మిషన్ నిరాకరించారు. హాస్టల్ విద్యార్ధులు, మహిళా కాలేజి విద్యార్థులు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించమన్నందుకు తీవ్రంగా లాఠీఛార్జీ చేయించారు.

గతం లో బషీర్‌బాగ్ కాల్పులు, అంగన్ వాడీలను గుర్రాలతో తొక్కించడం వలన ప్రజలు తెలుగుదేశం పార్టీని 10 సంవత్సరాలు అధికారానికి దూరంగా నెట్టారు. ఇప్పుడు కూడ ఆదే నిరంకుశ పోకడలు అనుసరిస్తున్నారు. ప్రజా సమస్యలు లేవనెత్తే సంస్థలన్నింటి విషయంలో

ఇదే నిర్బంధం సాగిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. తుళ్ళూరులో అసైన్డ్ దారులకు కౌలు ఇవ్వాలని నిరాహార దీక్షలు చేపడితే 144 సెక్షన్ పెట్టి వ్యవసాయ కార్మిక సంఘ నాయకులను అరెస్టు చేసి కేసులు పెట్టారు. సిపిఐ ఆధ్వర్యంలో పింఛన్లు, కౌలు ఇవ్వాలని చేపట్టిన పాదయాత్రకు అనుమతి ఇవ్వకపోగా అరెస్టుచేసి పోలీసు స్టేషనుకు తరలించారు. మంద కృష్ణ మాదిగ రాజధాని ప్రాంత దళితులు, ఇతర పేదల సమస్యపై నిరాహారదీక్షకు పూనుకోగా అడ్డుకున్నారు. రాయలసీమ పరిరక్షణసమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి రైతు బ్రతుకు దెరువు పాదయాత్రకు పోలీసులు బ్రేకు వేసి గృహనిర్బంధం చేశారు.

తోటపల్లి ప్రాజెక్టుకు భూములిచ్చి త్యాగం చేసిన 10,000 కుటుంబాలకు పరిహారం సక్రమంగా అందించాలని, ఆయకట్టు కాల్వల పనులు పూర్తిచేయాలని కోరినందుకు రాత్రికి రాత్రే నిర్వాసిత సంఘం, సిపియం నాయకులను అక్రమంగా నిర్బందించారు. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామంలో భూసేకరణ విషయమై పబ్లిక్ హియరింగ్‌కు వెళ్ళనీయకుండా ముందురోజు పోలీసు పెరేడ్‌లు నిర్వహించి భయపెట్టేందుకు పూనుకున్నారు. ప్రతి భూపోరాటంలోఅక్రమ కేసులు, నాన్ బెయిలబుల్ సెక్షన్లతో బనాయిస్తున్నారు.కష్టాలలో, బాధలలో ఉన్న ప్రజలను పరామర్శించడానికి కూడా విశాఖలో వామపక్షాల నాయకులకు స్వేచ్ఛ లేకుండా పోలీసులు వ్యవహరిస్తున్నారు. పోలాకిలో వామపక్షాల పర్యటనకు మైక్ పర్మిషన్ నిరాకరించారు. ప్రజలు తిరగబడటానికి మూల కారణమైన సమస్యలను పరిష్కరించకుండా పోలీసు నిర్బంధం ద్వారా ఉద్యమాలను అరికడదామనుకోవడం భ్రమ.

## భూ ఆర్డినెన్సు విరమించడం ఉద్యమ విజయం

భూసేకరణ చట్టాన్ని ప్రతిపాదించిన వివాదాస్పద సవరణలను నరేంద్ర మోడీ ప్రభుత్వం విరమించుకోవడం రైతుల ప్రతిఘటనకు విజయం. 2013 భూసేకరణ చట్టానికి 13 సవరణలు ప్రతిపాదించింది కేంద్ర ప్రభుత్వం. భూసేకరణకు రైతుల అంగీకారం అవసరం లేదని, రెండు పంటలు పండే భూములైనా లాక్కోవచ్చని, సామాజిక ప్రభావ అంచనా అవసరం లేదనేవి ముఖ్యమైనవి. నయానో, భయానో మిత్ర పక్షాలను, ప్రతి పక్షాలను లోబరుచుకుని గట్టెక్కవచ్చనే ఆలోచనతోనే 2014 డిశంబరు నుండి 2015 ఆగస్టు 31 వరకు మూడు సార్లు ఆర్డినెన్సు తెచ్చి చివరకు వెనక్కు తగ్గింది. ఈ భూ ఆర్డినెన్సును అడ్డం పెట్టుకుని చంద్రబాబు ప్రభుత్వం తుళ్ళూరులో రైతులను భయపెట్టి పూలింగ్‌కు బలవంతంగా అంగీకరింపజేసింది. ఆగస్టు 31తో గడువు పూర్తి అవుతుందనే భోగాపురం విమానాశ్రయానికి , బందరు పోర్టుకు, పొలాకి థర్మల్ కేంద్రానికి, భావనపాడు పోర్టుకు ఆర్డినెన్సు నిబంధనలతో నోటిఫికేషన్ ఇచ్చారు.

గుజరాత్ మోడల్ అంటేనే కార్పొరేట్‌లకు దోచిపెట్టే మోడల్. దానికి అభివృద్ధి అనే ముసుగు

తగిలించారు. నరేంద్రమోడీ గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అదాని గ్రూపుకు "ముంద్ర పోర్టు", "ముంద్ర సెజ్" లకు 16,750 ఎకరాలను రైతుల నుండి లాక్కుని చదరపు మీటరుకు ఒక రూపాయి రేటుతో కారు చౌకగా కట్టబెట్టారు. టాటా నానో కంపెనీకి రూ. 33,000కోట్లు రాయితీలిచ్చింది. ఎల్& టికి వేల ఎకరాలు ఇచ్చారు. మోడీ ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చినప్పుడు అదాని ఆస్తుల విలువ రూ. 2816 కోట్లు కాగా, మోడీ ప్రాపకంతో రూ. 35,881కోట్లకు పెరిగింది.

విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి నిధులు, మొదటి సంవత్సరం బడ్జెట్‌లో లోటు భర్తీ, ప్రత్యేక హెూదా, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజి నిధులు ఎ.పి.కి రావాల్సి ఉంది. వీటిపై చంద్రబాబు ఢిల్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయకపోవడానికి ఇద్దరూ కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడంలో ఉమ్మడి ప్రయోజనాలతో వ్యవహరించడమే ప్రధాన కారణం.

## 15 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ పరిశ్రమల పేర "పెద్దల" కు పందేరం

సరళీకరణ యుగంలో ల్యాండ్ బ్యాంక్ అనే పదం కొత్తగా పుట్టుకొచ్చింది. గతంలో ఎప్పుడూ వినలేదు. బొగ్గు, బాక్సైట్ గనులు, టెలిఫోన్ తరంగాలు( 2జి స్పెక్ట్రం), నగరాల్లో రియల్ ఎస్టేట్‌కు, మాల్స్‌కు భూములు తక్కువ రేటుతో కేటాయించడం గత కాలం విషయాలు. నేడు భూముల విలువ పెరగడం వలన ఏమారుమూల ప్రాంతమైనా బడాబాబులు అడిగిందే తడువుగా ప్రభుత్వ భూకేటాయింపులు చకచకా కేటాయించడం జరిగి పోతున్నాయి. డబ్బు అవసరమైతే బ్యాంక్‌కు వెళ్ళినట్లు, ఏ పారిశ్రామిక వేత్త అయినా భూమికోసం బ్యాంక్‌కు వెళ్ళవచ్చు. అవసరానికి మించి భూములు పొందవచ్చు. గతంలో పరిశ్రమలు పెట్టే చోట భూమి అడిగేవారు. ఇప్పుడు ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములున్నచోట పరిశ్రమలు పెట్టమంటున్నారు.

చంద్రబాబు ప్రభుత్వం భూసంస్కరణల జాతీయ విధానాన్నే పక్కకు నెట్టేసింది. గ్రామీణ పేదలు, భూమిలేని కుటుంబాల సంఖ్య ప్రపంచంలోకెల్లా భారతదేశంలోనే ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2011 సామాజిక ఆర్థిక కులగణనలో ఆంధ్రప్రదేశ్‌లో భూమిలేని కుటుంబాలు 73 శాతంగా తేలింది. గ్రామీణ జనాభాలో రోజూవారీ కూలి వెతుక్కునే వారు 59 శాతం. 75 శాతం ప్రజలు నెలకు రూ. 5వేల లోపు ఆదాయం పొందుతున్నారు. నోబుల్ బహుమతి గ్రహీత ప్రఖ్యాత ఆర్థిక వేత్త అమర్త్యసేన్ భూమి పంపిణీ ద్వారానే భారత్‌లో పేదరిక నిర్మూలన సాధ్యమని పేర్కొన్నారు. వీటన్నిటినీ విస్మరించి పేదల స్వాధీనంలో ఉన్న భూములన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం గుంజుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ బ్యాంక్ కోసం 15 లక్షల ఎకరాలు సేకరించాలని ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో 7,64,260.52 ఎకరాలు గుర్తించారు. నెల్లూరు జిల్లాలో సెజ్‌లు, పోర్టు, థర్మల్ ప్రాజెక్టుల కోసం 75 వేల ఎకరాలు సేకరించారు. ఇందులో 25వేల ఎకరాల్లోనే పరిశ్రమలు వచ్చాయి. 50 వేల ఎకరాలు ఖాళీగా పడి ఉన్నా మళ్ళీ లక్ష ఎకరాలు లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది. అర్బనైజేషన్ వలన వ్యవసాయ భూములు కుదించుకు పోతున్నాయి. భూబ్యాంకు వలన వీటిపై ఆధారపడిన వ్యవసాయ కార్మికులు, ఇతర పేదలు రోడ్డున పడతారు. ఉపాధిహామీ చట్టం కూడా సక్రమంగా అమలు కావడంలేదు. ఇప్పటికే వలసలు ఎక్కువగా ఉండగా ఇంకా భారీ ఎత్తున పెరిగే ప్రమాదం ఏర్పడింది. పంటభూమి తగ్గటంతో మరోవైపు ఆహార సంక్షోభం తీవ్రమవుతుంది.

- గుంటూరు జిల్లాలో రాజధానికి తీసుకునే 45,500ఎకరాలు గాక, పరిశ్రమలకోసం 48,560 ఎకరాలు అందుబాటులో ఉంచామని అధికారులు ఇది వరకే ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వ వివరాలను బట్టి 729 రెవెన్యూ గ్రామాల్లో ల్యాండ్ బ్యాంకు భూమి గుర్తించారు.
- కృష్ణా జిల్లాలో మైలవరం, నున్న, ఆగిరిపల్లి, నూజివీడు, మల్లవల్లి తదితర ప్రాంతాల్లోని సుమారు 26,000 ఎకరాలను డీనోటిఫై చేయాలని కేంద్రానికి పంపినట్లు అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాల కృష్ణా రెడ్డి పత్రికాముఖంగా ప్రకటించారు.
- కడప జిల్లాలో భూబ్యాంకుకు 1.05 లక్షల ఎకరాలు లక్ష్యం కాగా 78 వేల ఎకరాలు సేకరించారు.
- చిత్తూరు జిల్లాలో 19 మండలాల్లో 108 గ్రామాల పరిధిలో 67,382 ఎకరాల భూములను మొదటి విడత తీసుకుంటున్నారు. ఇందులో తరతరాలనుండి దళితులు, ఇతర పేదలు చెట్టుపుట్ట కొట్టి సేద్యం చేసుకుంటున్న అస్సైన్డ్ భూములే 37 వేల ఎకరాలు వున్నాయి. శ్రీకాళహస్తి, సత్యవీడు ప్రాంతాల్లో రెండుపంటలు పండే భూములు 66 వేల ఎకరాలు ల్యాండ్ బ్యాంకుకు కేటాయించారు.
- నెల్లూరు జిల్లాలో పైన పేర్కొన్నవి గాక 8 మండలాల్లో సుమారు 35 గ్రామాల పరిధిలో 62,112 ఎకరాలు గుర్తించగా ఇందులో దళితులు సాగు చేసుకుంటున్న భూములు 23,675 ఎకరాలు వున్నాయి.
- కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు, జూపాడు బంగ్లా మండలాల్లో 32 వేల ఎకరాలు అనేక సంవత్సరాలుగా పేదలు సాగుచేసుకుంటున్న భూములు వున్నాయి.

- తూర్పు గోదావరి జిల్లాలో 49,427 ఎకరాలు లక్ష్యం కాగా 25,519 ఎకరాలు గుర్తించారు. ఇది గాక 18, 413 ఎకరాలు అసైన్డ్ భూమిని గుర్తించారు.
- పశ్చిమ గోదావరి జిల్లాలో భూబ్యాంకు కోసం 16,000 అటవీ భూములు గుర్తించారు.
- ప్రకాశంలో 56 మండలాల్లో 1,97,067 ఎకరాలు గుర్తించారు.
- విజయనగరం జిల్లాల్లో 33 మండలాల్లో 37,923 ఎకరాలు సేకరించారు.
- శ్రీకాకుళం జిల్లాలో 4,601 ఎకరాలు గుర్తించారు.
- విశాఖ జిల్లా సముద్ర తీరప్రాంతంలో గత 11 సంవత్సరాలుగా 65 గ్రామాల్లో పిసిపిఐఆర్ పేరుతో 1,09,315 ఎకరాల్లో అధికభాగం గుంజుకొని మత్స్యకారులను, పేదలను నిరాశ్రయులను చేశారు.
- అనంతపురం జిల్లాలో లేపాక్షి హబ్ పేరుతో, సైన్స్ సిటీ పేరుతో వేలాది ఎకరాలు తీసుకొని నేడు ఆ భూమిని రియల్ఎస్టేట్ గా మార్చి వ్యాపారం చేస్తున్నారు. మరల ఇపుడు లక్ష ఎకరాల భూసేకరణకు పూనుకుంటున్నారు.

**ల్యాండ్ బ్యాంక్ కింద ప్రభుత్వం, ఎపిఐఐసి (మొదటి విడత) సేకరించిన భూవివరాలు**

(వెబ్సైట్లో ప్రకటించినవి)

| **జిల్లా పేరు** | **ఎకరాలు** |
|---|---|
| శ్రీకాకుళం | 4,493.37 |
| విజయనగరం | 16,913.39 |
| విశాఖ పట్నం | 63,332.99 |
| తూర్పు గోదావరి | 64,228.24 |
| పశ్చిమ గోదావరి | 1,388.15 |
| కృష్ణా | 15,384.74 |
| గుంటూరు | 48,634.73 |
| ప్రకాశం | 43,996.11 |
| నెల్లూరు | 62,112.86 |
| కడప | 1,06,829.04 |
| చిత్తూరు | 1,60,938.58 |
| కర్నూలు | 45,166.18 |
| అనంతపురం | 1,30,842.17 |
| **మొత్తం** | **7,64,260.52** |

**ఇళ్ళ స్థలాలు :–** గత 11 సంవత్సరాల నుండి రాష్ట్రంలో ఇళ్ళ స్థలాలు ఇవ్వడంలేదు.గత కాంగ్రెస్ ప్రభుత్వం మండల కేంద్రాలకు 5 కిలోమీటర్ల పరిధిలో ఏభూమికి ఇళ్ళ స్థలాలు ఇవ్వరాదని నిర్ణయించింది.తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి 16 మాసాలు అయినా దాన్ని రద్దుచేయకపోగా భూవ్యాపారం చేయడం ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం చదరపు గజం స్థలం వేలరూపాయలకు పెరిగింది. దిగువ మధ్యతరగతి ప్రజలు సైతం కొనలేని స్థాయికి భూమి విలువ పెరిగింది.ఒక్క కృష్ణా జిల్లాలోనే రైతులనుండి ఇళ్ళ స్థలాల కోసం గత ప్రభుత్వం హయాంలో కొనుగోలు చేసిన 800 ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. పట్టాలిచ్చి కూడా స్థలాలు విడగొట్టలేదు. ప్రతిజిల్లాలో ఇటువంటి సమస్య వుంది.

సాగుభూమి కోసం, ఇళ్ళ స్థలాల కోసం ప్రజలలో తీవ్రమైన ఆందోళన ఉన్నది. అవసరానికి మించి భూములు గుంజుకోవటానికి, ప్రభుత్వ భూములు, పంచిన భూముల నుండి పేదలను నిర్ధాక్షిణ్యంగా తొలగించడానికి వ్యతిరేకంగా దిగువ డిమాండ్స్ సాధనకు ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేపట్టాలని సిపిఐ(ఎం) పిలుపునిస్తున్నది.

## భూ సమస్యలు – డిమాండ్లు

(1) పారిశ్రామిక అభివృద్ధి పేరుతో బలవంతపు భూ సేకరణ ఆపాలి.

(2) అవసరానికి మించి భూములు రైతుల నుండి తీసుకోరాదు.

(3) ఎస్సైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, ఫారెస్టు భూముల నుండి పేదలను తొలగించరాదు. పట్టా భూములకిచ్చే నష్ట పరిహారాన్నే వీరికీ ఇవ్వాలి.

(4) పరిశ్రమల పేరుతోనూ, రాజధాని పేరుతోనూ సేకరించిన భూముల్ని ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు ఇవ్వరాదు.

(5) పరిశ్రమల ఏర్పాటు పేరుతో, ఎస్ఈ జెడ్‌ల పేరుతో సేకరించి ఐదేళ్ళకు మించి నిరుపయోగంగా ఉన్న భూములను తిరిగి రైతులకు ఇవ్వాలి.

(6) ల్యాండ్ బ్యాంక్ విధానానికి స్వస్తి చెప్పాలి.

(7) ఇళ్ళ స్థలాలకు ప్రభుత్వం సేకరించిన భూమిని పేదలకు పంచాలి. పంచరాదన్న జీవో రద్దు చేయాలి.

# పోరాడుతున్న ప్రజలకు విజ్ఞప్తి

రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణతో మొండిగా ముందుకు సాగుతోంది. జిల్లాలలో అనేక ప్రాంతాల్లో అవసరానికి మించి తీసుకొంటున్న భూముల మీద రైతులు పోరాటాలు సాగిస్తున్నారు. పేదలకు పంచిన భూములను గుంజుకొంటున్నందున దళితులు, బలహీన వర్గాలు, గిరిజనుల జీవనాధారం దెబ్బతింటున్న సమస్య ముందుకొచ్చింది.

సోంపేటలో థర్మల్ స్టేషన్‌కు కేటాయించిన భూమిని రద్దు చేయడం, భోగాపురంలో విమానాశ్రయానికి 15వేల ఎకరాల నుండి 5వేల ఎకరాలకు తగ్గించటం. ప్రజల ప్రతిఘటన వల్ల చేకూరిన ఫలితాలే.

కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టే ప్రభుత్వ భూవిధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాపితంగా ఉద్యమాన్ని విస్తరింపచేయాలి. దీన్ని వీలైనంత విశాల ఉద్యమంగా మలచడం పైనే రైతుల, అసైన్డ్‌దారుల విజయం ఆధారపడి ఉంటుంది. అందుకు అందరూ సమైక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

వెల రూ. 5/-

**27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202**